ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ అన్ని నియోజకవర్గాలలో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA

APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 102 చీఫ్ ఎడిటర్.. కలికి ఉదయ్ కుమార్ రెడ్డి, పేజీలు : 08, వెల రూ. 1/- బుధవారం - 13 - మే - 2026


## ధాన్యం కొనుగోళ్లపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

- ★ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు
- ★ కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవు
- ★ ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత వహించాలని స్పష్టం
- ★ రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై ముఖ్యమంత్రి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్
- ★ ఎప్పటికప్పుడు నివేదికలు పంపించాలని కలెక్టర్లను ఆదేశించారు
- ★ ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలి
- ★ గోదాన్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలి




హైదరాబాద్: మిషన్ మోడ్‌లో పనిచేస్తూ రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై ముఖ్యమంత్రి గారు క్యాంపు కార్యాలయంలో వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోళ్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారికి ఎప్పటికప్పుడు నివేదికలు పంపించాలని కలెక్టర్లను ఆదేశించారు. "కొనుగోలు కేంద్రాల్లో అధికారులు ఎప్పటికప్పుడు

## ఏపీలో స్థానిక ఎన్నికలపై ఎస్ఈసీ స్పెషల్ ఫోకస్

అమరావతి., : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కీలక సమావేశం నిర్వహించింది. స్టేట్ ఎలక్షన్ కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎన్నికల సన్నాహకాలు, ప్రీ-ఎలక్షన్ కార్యకలాపాల పురోగతిపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి పంచాయతీరాజ్, మున్సిపల్, బీసీ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. గ్రామ పంచాయతీలు, అర్బన్ లోకల్ బాడీస్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులు వివరాలు సమర్పించారు.

### ప్రీ-ఎలక్షన్ కార్యకలాపాలపై సమీక్ష..

స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుగా చేపట్టాల్సిన కార్యక్రమాల పురోగతిని ఎస్ఈసీ సమీక్షించారు. ఓటరు జాబితాల సవరణ, రిజర్వేషన్ల ఖరారు, వార్డుల విభజన, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు వంటి అంశాలపై చర్చించారు.

### కార్యాచరణ ప్రణాళికపై చర్చ

ఎన్నికల నిర్వహణను పారదర్శకంగా, సమర్థవంతంగా చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికపై ఈ సమావేశంలో చర్చించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు.




### ముందస్తు ఏర్పాట్లు వేగవంతం చేయాలి

ప్రీ-ఎలక్షన్ పనులను వేగవంతం చేయాలని స్టేట్ ఎలక్షన్ కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఆలస్యం లేకుండా అన్ని ఏర్పాట్లు గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

### ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి

స్థానిక సంస్థల ఎన్నికలపై ఇప్పటికే రాజకీయ పార్టీల్లో చర్చ మొదలైంది. గ్రామ పంచాయతీలు, మున్సిపల్ సంస్థల ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నాహకాలను వేగవంతం చేస్తోంది.

## ఇంధన నిల్వలున్నాయి, కానీ.. పెట్రోలియం మంత్రి కీలక సంకేతాలు




ఢిల్లీ: కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి ఇంధన కొరత లేదంటూనే పెంపు సంకేతాలిచ్చారు. మే 12ననిర్వహించిన 'సిఐఐ వార్షిక బిజినెస్ సమ్మిట్-2026'లో దేశంలోని ఇంధన నిల్వలు, ధరల పెరుగుదలపై కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఇంధన కొరత లేదని మంత్రి స్పష్టం చేశారు. అయితేనాలుగేళ్లుగా ఇంధన పెంచలేదు,

## గౌహతిలో కేంద్ర మంత్రి గడ్కరీతో చంద్రబాబు, లోకేష్ భేటీ




- ▶▶ 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా'ను కలవడం సంతోషంగా ఉంది: నారా లోకేష్
- ▶▶ అసోం సీఎం ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన నేతలు
- ▶▶ గడ్కరీని 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అభివర్ణించిన లోకేష్

## బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక పరిణామం




హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోసం బండి భగీరథ్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు మే 14న విచారణ చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## "తల్లులు నగలు అమ్ముకున్నారు.. తండ్రులు అప్పులు.."

- ❖ 22 లక్షల మంది విద్యార్థుల కష్టాన్ని, కలలను ఛిన్నాభిన్నం చేశారని ఆగ్రహం
- ❖ పిల్లల కోసం తల్లిదండ్రులు రుణాలు తీసుకున్నారని, బంగారం అమ్మేశారన్న రాహుల్ గాంధీ
- ❖ కేవలం వైఫల్యం కాదు విద్యార్థుల భవిష్యత్తుపై జరిగిన నేరమన్న రాహుల్ గాంధీ




ఢిల్లీ: నీట్ యూజీ 2026 పరీక్షను రద్దు చేయల్సి రావడం పట్ల లోకసభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. నీట్ 2026 పరీక్షను రద్దు చేసి, 22 లక్షలకు పైగా విద్యార్థుల కష్టాన్ని వృథా చేశారంటూ ఎక్స్‌లో ఆయన ఓ పోస్ట్ చేశారు.

## ఆయనకు న్యాయం చేయండి... ఇంకా బంగ్లాదేశ్ జైల్లోనే మగ్గుతున్నారు




- ★ బంగ్లాదేశ్‌లో జైలులో ఉన్న ఇస్కాన్ సన్యాసిని విడుదల చేయాలన్న పవన్
- ★ 500 రోజులుగా నిర్బంధంలో ఉన్నా బెయిల్ నిరాకరించడంపై ఆగ్రహం
- ★ మైనారిటీ హిందువుల హక్కుల కోసం మాట్లాడటం నేరమా అని ప్రశ్న

## బీఆర్ఎస్ కీలక నేతలతో కేసీఆర్ భేటీ




- ➤ ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కీలక సమావేశం నిర్వహించిన కేసీఆర్
- ➤ పార్టీ సంస్థాగత మార్పులు, భవిష్యత్తు కార్యాచరణపై దిశానిర్దేశం
- ➤ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంపై ఫోకస్

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కీలక సమావేశం జరిగింది. పార్టీ సంస్థాగత మార్పులు, భవిష్యత్తు కార్యాచరణపై ఈ భేటీలో స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడం... జిల్లా, నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్‌ఛార్జుల

## నీట్ పేపర్ లీకేజీ, రద్దు... కేంద్రంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

- ★ విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాట మాడుతోందని ఆగ్రహం
- ★ పరీక్ష రద్దు కేంద్రం వైఫల్యమన్న కేటీఆర్
- ★ 2024లో కూడా ప్రశ్నాపత్రం లీకైందన్న కేటీఆర్




## సుప్రీంకోర్టును ఆశ్రయించిన విజయ్ టీవీకే

ఢిల్లీ: తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టీవీకే సుప్రీంకోర్టును ఆశ్రయించింది.




మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని కోరుతూ సర్వోన్నత న్యాయస్థానంలో టీవీకే నేత, తిరుపత్తూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్.శ్రీనివాస సేతుపతితో పిటిషన్ దాఖలు చేయించింది. అసెంబ్లీలో ఫ్లోర్ టెస్ట్ సమయంలో ఓటు వేయకుండా సేతుపతిపై హైకోర్టు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. తమిళనాడు ఎన్నికల్లో డీఎంకే నేత పెరియకరుప్పన్‌పై కేవలం ఒక్క ఓటు తేడాతో గెలిచారు సేతుపతి.

## ఐఐటీ మద్రాస్‌లో బీఎస్ డిగ్రీ

చెన్నై: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) మద్రాస్ తమ బీఎస్ డిగ్రీ ప్రోగ్రామ్‌ల కోసం 2026 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లను ఆహ్వానించింది.




ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఒక ప్రకటనలో తెలిపింది. 12వ తరగతి (ఇంటర్మీడియెట్) పూర్తి చేసిన ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. ఎటువంటి వయోపరిమితి లేదని ప్రకటించింది. సంప్రదాయ ఇంజనీరింగ్ కోర్సుల్లా కాకుండా, దీనికి జేఈఈ స్కోరుతో సంబంధం లేదని

# సుప్రీంకోర్టును ఆశ్రయించిన విజయ్ టీవీకే

మొదటి పేజి తరువాయి

తమిళనాడు ఎన్నికల్లో డీఎంకే నేత పెరియకరుప్పన్‌పై కేవలం ఒక్క ఓటు తేడాతో గెలిచారు సేతుపతి. స్వల్ప మెజారిటీపై ప్రత్యర్థి ఫిర్యాదు చేయడంతో సేతుపతి ఓటు హక్కుపై న్యాయస్థానం ఆంక్షలు విధించింది. దీంతో ప్రజాప్రతినిధిగా తన హక్కులను కాపాడాలని సుప్రీంకోర్టును కోరారు సేతుపతి. సుప్రీంకోర్టు తీర్పుపై ఉత్కంఠ నెలకొంది. కాగా, మంగళవారం జరగనున్న అసెంబ్లీ విశ్వాస పరీక్షలో పాల్గొనకుండా టీవీకే అభ్యర్థి శ్రీనివాస సేతుపతిని మద్రాస్ హైకోర్టు ఆదేశించడంతో ఆ పార్టీకి ఎదురుదెబ్బ తగిలిన విషయం తెలిసిందే. బ్యాలెట్ ఓటులో మార్పులు జరిగాయని ఆరోపిస్తూ, ఎమ్మెల్యేగా సేతుపతి బాధ్యతలు చేపట్టకుండా ఆపాలని కేఆర్ పెరియకరుప్పన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరుగుతున్న సమయంలో హైకోర్టు నుంచి ఆంక్షలు విధిస్తూ ఈ ఉత్తర్వులు వచ్చాయి.పిటిషన్ ప్రకారం.. తిరుపత్తూర్ నియోజకవర్గం నం.185లో నమోదు కావాల్సిన ఓటును వెల్లూరు జిల్లాలోని తిరుపత్తూర్ నియోజకవర్గం నం.50కు మార్చినట్టు ఆరోపణలు వచ్చాయి. ఫిర్యాదుపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ పెరియకరుప్పన్ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సమయంలో, ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తర్వాత బ్యాలెట్ వ్యత్యాసాలపై ఫిర్యాదు వస్తే నిబంధనల ప్రకారం చర్యలు అవసరం లేదని ఎన్నికల సంఘం తెలిపింది. ఒక్క ఓటును కూడా మరో నియోజకవర్గానికి మార్చలేదని సంఘం వెల్లడించింది. అయితే, పెరియకరుప్పన్ సమర్పించిన ఫిర్యాదుకు మద్దతుగా సరిపడా ఆధారాలు ఉన్నాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఎమ్మెల్యేగా అసెంబ్లీ విశ్వాస పరీక్షలో పాల్గొనకుండా శ్రీనివాస సేతుపతిపై హైకోర్టు ఆంక్షలు విధించింది.

# ఐఐటీ మద్రాస్‌లో బీఎస్ డిగ్రీ

మొదటి పేజి తరువాయి

అభ్యర్థులు 'క్వాలిఫైయర్ ప్రాసెస్' ద్వారా నేరుగా అడ్మిషన్ పొందవచ్చని, ప్రస్తుతం నాలుగు విభాగాల్లో ఈ బీఎస్ డిగ్రీలను అందిస్తున్నట్టు అధికారులు తెలిపారు. బీఎస్ ఇన్ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్, బీఎస్ ఇన్ ఎలక్ట్రానిక్ సిస్టమ్స్, బీఎస్ ఇన్ మేనేజ్‌మెంట్ అండ్ డేటా సైన్స్, బీఎస్ ఇన్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ టెక్నాలజీ కోర్సులు ఉన్నుట్టు తెలిపారు. ఈ కోర్సులను రెగ్యులర్ కాలేజీ డిగ్రీ చదువుతూనే సమాంతరంగా పూర్తి చేయవచ్చని వివరించారు. తరగతులు ప్రధానంగా ఆన్‌లైన్ ద్వారా జరుగుతాయని, పరీక్షలు మాత్రం దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రాల్లో నేరుగా నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు తమ అవసరాన్ని బట్టి సర్టిఫికెట్, డిప్లొమా, లేదా పూర్తి డిగ్రీ పొంది ఏ దశలోనైనా కోర్సు నుంచి వైదొలగవచ్చునని వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల కోసం ఫీజులో 75 శాతం వరకు రాయితీని అందిస్తున్నట్టు ప్రకటించారు. ఆసక్తిగల విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌లో, మే 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డిపార్ట్‌మెంటల్ టెస్ట్‌కు దరఖాస్తులు

అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులకు మే 2026 సెషన్ డిపార్ట్‌మెంటల్ టెస్ట్ షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 13 నుంచి జూన్ 2 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని సర్వీస్ కమిషన్ విజ్ఞప్తి చేసింది. అలాగే ఇంటర్ విద్యశాఖలో లైబ్రరీ సైన్స్ జూనియర్ లెక్చరర్ (లిమిటెడ్ రిక్రూట్‌మెంట్) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. వివరాలకు https://psc.ap.gov.in/లో చూడవచ్చు.

ఎస్సీ గురుకులాల్లో కాంట్రాక్ట్ టీచర్ల పునరుద్ధరణ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న 740 మంది కాంట్రాక్ట్ టీచింగ్ ఫ్యాకల్టీలను ప్రభుత్వం పునరుద్ధరించింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు 11 నెలల వ్యవధికి రెన్యూవల్ చేశారు. 2026--ు27ుకి ఒక నెల విరామంతో అవకాశం ఇస్తున్నామని, పనిచేయకపోతే జీతం లేదనే షరతుతో పునరుద్ధరిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీ, రద్దు... కేంద్రంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

హైదరాబాద్: వైద్య విద్య జాతీయ అర్హత పరీక్ష (నీట్-యూజీ) 2026 పరీక్ష రద్దుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. లక్షలాదిమంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా పరీక్ష రద్దు పరిస్థితి రావడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని అన్నారు. ఇది కేంద్రానికి సిగ్గుచేటు అన్నారు. ఎన్డీయే వైఫల్యం విద్యార్థులకు శాపంగా మారిందని అన్నారు. ఏకంగా వందకు పైగా ప్రశ్నలు పరీక్షకు ముందు రోజే లీక్ అయ్యాయని ఆరోపించారు. కష్టపడి చదివిన విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024లో కూడా ప్రశ్నాపత్రం లీకైందని గుర్తు చేశారు. ఎన్డీయే ప్రభుత్వం వైఫల్యం వల్లే మరోసారి అలాంటి పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు. నీట్ పేపర్ లీకేజీ, పరీక్ష రద్దుపై తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు మానసిక వేదనకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష లీకేజీతో ప్రతి దశలో మోసాలు కనబడుతున్నాయని విమర్శించారు. నీట్ పరీక్ష వ్యవస్థే పెద్ద కుంభకోణమని, ప్రతి సంవత్సరం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. ప్లస్ టూ పరీక్షల్లో స్కోర్ ఆధారంగా ఎంబీబీఎస్ సీట్లు కేటాయించే పాత విధానం తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## "తల్లులు నగలు అమ్ముకున్నారు.. తండ్రులు అప్పులు.."

మొదటి పేజి తరువాయి

నీట్ 2026 పరీక్షను రద్దు చేసి, 22 లక్షలకు పైగా విద్యార్థుల కష్టాన్ని వృథా చేశారంటూ ఎక్స్‌లో ఆయన ఓ పోస్ట్ చేశారు. "వారి కలలను బీజేపీ ప్రభుత్వం అణచివేసింది. కొందరు తండ్రులు అప్పులు తీసుకున్నారు, కొందరు తల్లులు తమ నగలు అమ్ముకున్నారు, లక్షలాది మంది పిల్లలు రాత్రంతా మేల్కొని చదువుకున్నారు. దానికి ప్రతిఫలంగా, వారికి పేపర్ లీకులతో షాక్ ఇచ్చారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యారంగంలో వ్యవస్థీకృత అవినీతి నెలకొంది. ఇది కేవలం వైఫల్యం మాత్రమే కాదు.. ఇది యువత భవిష్యత్తుకు వ్యతిరేకంగా జరిగిన నేరం. ప్రతిసారి పేపర్ మాఫియా నిర్దాక్షిణ్యంగా తప్పించుకుంటోంది. నిజాయితీగల విద్యార్థులు శిక్షను అనుభవిస్తున్నారు. ఇప్పుడు, లక్షలాది మంది విద్యార్థులు మరోసారి అదే మానసిక ఒత్తిడి, ఆర్థిక భారం, అనిశ్చితిని భరించాలి. ఒకరి తల రాతను వారి కష్టంతో కాకుండా డబ్బు, పలుకుబడితో నిర్ణయిస్తే ఇక చదువుకు అర్థం ఏముంటుంది? ప్రధానమంత్రి అమృత్ కాలం దేశానికి విష కాలంగా మారింది" అని విమర్శించారు. కాగా, మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షను కేంద్రం రద్దు చేసింది. ప్రశ్నపత్రం లీక్, పరీక్షలో అక్రమాల ఆరోపణల మధ్య ఈ నిర్ణయం తీసుకుంది. ఈ వైద్య ప్రవేశ పరీక్షను మళ్లీ నిర్వహిస్తామని ప్రకటించింది. ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు సీబీఐకు ఈ కేసును అప్పగించింది. ఓ ప్రకటనలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలిపిన వివరాల ప్రకారం.. కేంద్ర సంస్థల నుంచి సమాచారాన్ని పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. వ్యవస్థలో పారదర్శకతను కొనసాగించేందుకు భారత ప్రభుత్వం ఆమోదంతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ (యూజీ) 2026 పరీక్షను రద్దు చేయాలని నిర్ణయించింది. సీబీఐకి పూర్తి సహకారం అందిస్తామని ఎన్‌టీఏ చెప్పింది. విచారణకు అవసరమైన పత్రాలు, రికార్డులు అందజేస్తుందని తెలిపింది. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర అండర్‌గ్రాడ్యుయేట్ వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఏకైక ప్రవేశ పరీక్ష నీట్-యూజీ. దీన్ని మే 3న పెన్ అండ్ పేపర్ విధానంలో నిర్వహించారు. భారత్‌లోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో 5,400కు పైగా కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగింది. సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు.

## గౌహతిలో కేంద్ర మంత్రి గడ్కరీతో చంద్రబాబు, లోకేష్ భేటీ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ గౌహతిలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అసోం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనేందుకు వెళ్లిన వీరు, గౌహతి విమానాశ్రయంలో గడ్కరీని కలిశారు. ఈ సమావేశం అనంతరం మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా వేదికగా తన స్పందనను పంచుకున్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా' అని అభివర్ణించిన లోకేష్, ఆయనను కలవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. జాతి నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనలో గడ్కరీ చూపిస్తున్న ఉత్సాహం తమందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశాన్ని వేగంగా, బలంగా నిర్మించాలన్న ఆయన తపన అమోఘమని కొనియాడారు. ఈ సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను గడ్కరీ ప్రశంసించారని లోకేష్ వెల్లడించారు. ఏపీలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు నిర్మించేందుకు తాము చేస్తున్న కృషికి ఆయన ప్రోత్సాహం ఎంతో విలువైనదని లోకేష్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ భేటీలో చంద్రబాబు, గడ్కరీ పలు అంశాలపై చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ఈ భేటీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా పాల్గొన్నారు.

# ఆయనకు న్యాయం చేయండి... ఇంకా బంగ్లాదేశ్ జైల్లోనే మగ్గుతున్నారు

అమరావతి: బంగ్లాదేశ్‌లో 500 రోజులకు పైగా జైలులో ఉన్న ఇస్కాన్ సన్యాసి చిన్మయ్ కృష్ణ దాస్ ప్రభుకు తక్షణమే న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. ఆయనకు వైద్య సహాయం అందించడంతో పాటు, వెంటనే బెయిల్ మంజూరు చేయాలని బంగ్లాదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొందరు మానవ హక్కుల కార్యకర్తలు ప్రదర్శిస్తున్న మౌనాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఈ అంశంపై పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. "500 రోజులకు పైగా జైలు, పదేపదే బెయిల్ నిరాకరణ. ఆయన తరఫు న్యాయవాదులను కూడా కోర్టు హాలులో బెదిరిస్తుంటే ఇక న్యాయం ఎలా జరుగుతుంది? మైనారిటీ హిందూ సమాజం హక్కుల కోసం పోరాడటం నేరమా?" అని ప్రశ్నించారు. కాషాయ వస్త్రాలు ధరించిన ఒక ఆధ్యాత్మిక గురువును నేరస్థుడిలా చూస్తూ, ఆయన గొంతు నొక్కుతుంటే ప్రపంచం మౌనంగా ఉండకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. "కొన్ని అంశాలపై హ్యాష్‌ట్యాగ్‌లతో రాత్రికి రాత్రే స్పందించే నకిలీ సెక్యులరిస్టులు, సెలెక్టివ్ మానవ హక్కుల కార్యకర్తలు ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారు? వారి మానవత్వానికి కూడా ఫిల్టర్ ఉందా?" అని పవన్ విమర్శించారు. చిన్మయ్ కృష్ణ దాస్ ప్రభుకు వెంటనే న్యాయపరమైన సహాయం, వైద్యం అందించి, బెయిల్‌పై విడుదల చేయాలని ఆయన కోరారు.

# ఇంధన నిల్వలున్నాయి, కానీ.. పెట్రోలియం మంత్రి కీలక సంకేతాలు

మొదటి పేజి తరువాయి



దేశంలో ఇంధన కొరత లేదని మంత్రి స్పష్టం చేశారు. అయితేనాలుగేళ్లుగా ఇంధన పెంచలేదు, ధరలు పెరగబోవని చెప్పడం లేదంటూ మెలిక పెట్టడం చర్చకు దారి తీసింది. అయిదు రాష్ట్రాల ఎన్నికల తరువాత వంట గ్యాస్, పెట్రోవాత తప్పదనే వివిధ అంచాలన మధ్య దేశంలో ఎక్కడా ఇంధన కొరత లేదని స్పష్టం చేస్తూ, ప్రభుత్వం ఎల్‌పీజి ఉత్పత్తిని గతంలో ఉన్న సుమారు 35,000 టన్నుల నుండి 54,000 టన్నులకు పెంచిందని కేంద్ర చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. పెరిగే అవకాశం లేకపోలేదంటూ సంకేతాలు ఇచ్చారు. మరోవైపు ఇటీవలే ముగిసిన రాష్ట్ర ఎన్నికల కారణంగా ప్రభుత్వం ధరల సవరణను వాయిదా వేసిందన్న ఊహాగానాలను ఆయన కొట్టిపారేశారు.

నాలుగేళ్లుగా పెంచలేదు

పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఒత్తిళ్లు ,ప్రపంచ మార్కెట్ అస్థిరత ఉన్నప్పటికీ, గత నాలుగేళ్లుగా రిటైల్ ఇంధన ధరలు స్థిరంగా ఉన్నాయని మంత్రి స్పష్టంగా పేర్కొన్నారు. ప్రపంచంలో అలా చేయని ఏకైక దేశం మనదే అని కూడా ప్రకటించారు. ధరలు 50 నుండి 60 శాతం వరకు పెరిగిన అనేక దేశాల మాదిరిగా కాకుండా, భారతదేశం పరిస్థితిని సమర్థవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. అయినా పెరగవని తాను చెప్పడంలేదంటూ బాంబు పేల్చారు. దీనికి తోడు ఇటీవల ప్రధాని మోదీ డీజిల్, పెట్రోల్ వాడకాన్ని తగ్గించుకోవాలని, పొదుపుగా వాడాలని సూచించడం ప్రమాద హెచ్చరికగా అందరూ భావిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల కారణంగానే ధరల పెంపును వాయిదా వేస్తున్నారనే వాదనను ఆయన తోసిపుచ్చారు. ధరల నిర్ణయానికి, ఎన్నికలకు సంబంధం లేదని స్పష్టం చేశారు.మన దగ్గర 60 రోజులకు సరిపడా ముడి చమురు, 60 రోజులకు సరిపడా ఎల్ఎన్‌జీ+, 45 రోజులకు సరిపడా ఎల్‌పీజి నిల్వలు ఉన్నాయని కేంద్ర మంత్రి వివరించారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం ఉందనే సంకేతాలిచ్చారు. ప్రస్తుతం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (రావీజం) రోజుకు రూ. 1,000 కోట్ల నష్టాన్ని చవిచూస్తున్నాయని, వినియోగదారులపై భారం పడకుండా ఉండటానికి కంపెనీలు ఈ నష్టాన్ని భరిస్తున్నాయని తెలిపారు. గతేడాది ఆర్జించిన లాభాలన్నీ ప్రస్తుత పరిస్థితుల వల్ల తుడిచిపెట్టుకుపోతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. సముద్ర మంథన్ స్కీమ్ ద్వారా దేశీయంగా చమురు ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని మంత్రి వెల్లడించారు. చమురు అన్వేషణ మరియు ఉత్పత్తి కోసం నిధుల కేటాయింపుపై ఆర్థిక శాఖతో చర్చలు తుది దశలో ఉన్నాయన్నారు. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం 90 రోజులకు సరిపడా నిల్వలను కలిగి ఉండాలని, ఆ దిశగా అదనపు స్టోరేజ్ సామర్థ్యాన్ని పెంచుతున్నామని ఆయన చెప్పారు. కాగా అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం మూడో నెలకు చేరుకుంది. శాంతి ప్రయత్నాల్లో భాగంగా ఇరాన్ ఇచ్చిన ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మే 10న తిరస్కరించడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. దీని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాపై పడనుందనే ఆందోళన నెలకొంది.

# ధాన్యం కొనుగోళ్లపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

మొదటి పేజి తరువాయి




"కొనుగోలు కేంద్రాల్లో అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలి. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్లకు తరలించాలి. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించరాదు. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దు. ధాన్యం లోడింగ్ విషయంలో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలి. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలి. అలా చేయడం వల్ల తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చు" అని చెప్పారు. లారీల కొరత ఉంటే దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని, ధాన్యం తరలించడానికి అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని ఈ సందర్భంగా రవాణా శాఖ కమిషనర్‌ను ఆదేశించారు. "పలు ప్రాంతాల్లో గోదాముల సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. అలాంటి ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలి. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలి. అవసరమైన చోట రైతుబజార్లు, ఫంక్షన్ హాళ్లను అందుబాటులోకి తీసుకుని ధాన్యాన్ని తరలించాలి. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్లకు తరలించేలా ప్రణాళికలుండాలి" అని సూచించారు. ప్రాంతాల వారిగా సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతి అధికారి జవాబుదారితనంతో వ్యవహరించాల్సిందేనని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహించే అధికారులు, కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని ఆదేశించారు. అకాల వర్షాల సమయంలో రైతులకు నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ఇలాంటి సమయాల్లో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలి. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలి. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ప్రతీ ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలి. ప్రతి రైస్‌మిల్లు వద్ద ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలి" అని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, తుమ్మల నాగేశ్వర రావు గారు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు, జూపల్లి కృష్ణారావు గారు, ధనసరి అనసూయ సీతక్క గారు, వాకిటి శ్రీహరి గారు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు గారితో పాటు అధికారులు పాల్గొన్నారు.

# బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక పరిణామం

మొదటి పేజి తరువాయి



ఈ పిటిషన్‌పై హైకోర్టు మే 14న విచారణ చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక ఈ కేసు విచారణ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. సిట్ బృందం భగీరథ్‌ను స్వయంగా విచారణ చేయడానికి ప్రయత్నాలు చేస్తోంది. పోక్సో కేసు నమోదు, సిట్ ఏర్పాటు పరిణామాల నడుమ భగీరథ్ పరారీలో ఉన్నాడు. అతని ఆచూకీ తెలిసిన వెంటనే పోలీసులు విచారణ చేపట్టనున్నారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్మెంట్‌ను పోలీసులు రికార్డు చేశారు. ఆ స్టేట్మెంట్ ఆధారంగా భగీరథ్‌ను ప్రశ్నించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో బండి భగీరథ్ మధ్యంతర బెయిల్ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు.

కేసు పూర్వాపరాల్ని పరిశీలిస్తే

బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై పేట్ బషీరా బాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసు దర్యాప్తును ప్రత్యేక బృందానికి అప్పగించారు. కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్ ఈ టీమ్‌ను పర్యవేక్షించనున్నారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీసు కమిషనర్ ఎం. రమేశ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కుత్బుల్లాపూర్ సమీపంలోని సుచిత్రలో నివసించే పదిహేడేళ్ల బాలికపై భగీరథ అసభ్యంగా ప్రవర్తించి ఇబ్బందులకు గురి చేశారనే ఫిర్యాదు మేరకు శుక్రవార రాత్రి పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. తనతో స్నేహం చేసిన భగ రథ డిసెంబర్ 31న మొయినాబాద్ లోని ఫామ్ హౌస్‌కు తీసుకువెళ్లారని, పెళ్లి చేసుకుంటానంటూ ఆదేరోజు రాత్రి అసభ్యంగా ప్రవర్తించారని మైనర్ ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు భగీరథపై కేసు నమోదు చేశారు. బాలికను భరోసా కేంద్రానికి తీసుకువెళ్లడంతో పాటు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అయితే పేట్ బషీరాబాద్ ఠాణాలో కేసు నమోదుకు ముందే కరీంనగర్ లో సదరు బాలికపై భగీరథ ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్ సోమవారం సమీక్ష నిర్వహించారు. కాగా ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా విచారణ సాగుతుందని, ప్రతి అంశాన్నీ పరిగణనలోకి తీసుకుని దర్యాప్తు చేస్తామని సైబరాబాద్ సీపీ ప్రకటించారు. మరోవైపు భగీరథపై వార్తా పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా ఈ కేసును రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సుమోటోగా స్వీకరించింది. బండి భగీరథ పరారీలో ఉన్నట్లు కేసు విచారణాధికారి,డీసీపీ రీతిరాజ్ సోమవారం మీడియాకు తెలిపారు. మూడు రోజులుగా అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ లో ఉందని చెప్పారు. అతని ఆచూకీ కోసం గాలి స్తున్నామని, కాల్ డేటా రికార్డ్ (సీడీఆర్) పరిశీలిస్తుస్తున్నామని వెల్లడిం చారు. బాలిక స్టేట్మెంట్ రికార్డ్ చేశామని, మరిన్ని వివరాల కోసం ఇం కోసారి ప్రశ్నిస్తామని వివరించారు.

## బీఆర్ఎస్ కీలక నేతలతో కేసీఆర్ భేటీ

మొదటి పేజి తరువాయి

జిల్లా, నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్‌ఛార్జుల నియామకం, అలాగే అంతర్గత కమిటీల ఏర్పాటుపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడానికి ఈ సంస్థాగత మార్పులు దోహదపడతాయని నాయకత్వం భావిస్తోంది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, శాసనసభ, మండలి పక్షాల ప్రముఖ నేతలు పాల్గొన్నారు. హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మధుసూదనాచారి, ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, బండ ప్రకాశ్ ముదిరాజ్, వి. గంగాధర్ గౌడ్, జోగినపల్లి సంతోశ్ కుమార్, నారదాసు లక్ష్మణరావు, ఆర్. శ్రవణ్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, టి. జీవన్ రెడ్డి, సోమా భరత్ కుమార్ గుప్తా, సత్యవతి రాథోడ్, రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు సమావేశానికి హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా సురేశ్ రెడ్డి, మహమూద్ అలీ, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు మరియు ఇతర రాజకీయ సవాళ్లపై ఈ సమావేశంలో నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రభుత్వ విధానాలపై పోరాటం చేస్తూనే, ప్రజల్లోకి పార్టీని మరింత సమర్థవంతంగా తీసుకువెళ్లేందుకు అవసరమైన ప్రణాళికలను ఈ సమావేశంలో సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించాలని, అలాగే జిల్లా పర్యటనల ద్వారా క్యాడర్‌తో నేరుగా మమేకం కావాలని కేసీఆర్ సూచించినట్లు తెలుస్తోంది.

## షణ్ముగం నివాసానికి విజయ్... అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేలతో కీలక భేటీ



ఢిల్లీ: తమిళనాడు రాజకీయాల్లో మే 10న విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పరిస్థితులు అత్యంత వేగంగా మారుతున్నాయి. మే 13 జరగనున్న ఫ్లోర్ టెస్ట్ కు ముందు అన్నాడీఎంకేలో చీలిక రావడం విజయ్ ప్రభుత్వానికి పెద్ద ఊరటనిచ్చే పరిణామం అని చెప్పవచ్చు. ప్రభుత్వ ఏర్పాటుకు ముందు మెజారిటీ మార్క్ (118)కు కొద్దిగా దూరంలో నిలిచిన టీవీకే అధినేత విజయ్ క్రమంగా పలు పార్టీల నుంచి మద్దతు లభించింది. రేపు (మే 13) బలపరీక్ష నేపథ్యంలో, అన్నాడీఎంకే సీనియర్ నేత సీవీ షణ్ముగం నాయకత్వంలో సుమారు 30 మంది ఎమ్మెల్యేలు విజయ్‌కు మద్దతు ఇచ్చేందుకు సిద్ధమవ్వడం సంచలనం రేపింది. తాజాగా రెబల్ నేత షణ్ముగం ఇంటికి విజయ్ స్వయంగా వెళ్లారు. షణ్ముగం, వేలుమణి సహా 30 మంది ఎమ్మెల్యేలతో ఆయన భేటీ అయ్యారు. ఈ సమావేశంలో భవిష్యత్తు రాజకీయ వ్యూహాలు, మంత్రి పదవుల కేటాయింపుపై ఈ భేటీలో విజయ్ చర్చించినట్లు సమాచారం. ఈ పరిణామం విజయ్ ముఖ్యమంత్రిగా తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి మార్గం సుగమం చేసింది. పార్టీపై పట్టు కోల్పోయిన పళనిస్వామికి ఇప్పుడు కేవలం 17 మంది ఎమ్మెల్యేలు మాత్రమే మిగిలి ఉన్నారు. గత ఎన్నికల్లో పొత్తుల విషయంలో ఆయన అనుసరించిన మొండి వైఖరే పార్టీలో అసంతృప్తికి, తాజా చీలికకు ప్రధాన కారణమని సొంత పార్టీ నేతలే బహిరంగంగా విమర్శిస్తున్నారు. షణ్ముగం, వేలుమణి వంటి కీలక నేతలు విజయ్ వైపు మొగ్గు చూపడంతో అన్నాడీఎంకే ఉనికి ఇప్పుడు ప్రమాదంలో పడింది.

## సరిహద్దులో భారత్ ఫెన్సింగ్... ఘాటుగా స్పందించిన బంగ్లాదేశ్



ఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి నేతృత్వంలోని నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సరిహద్దు రక్షణపై తీసుకున్న నిర్ణయం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయంపై బంగ్లాదేశ్ ప్రభుత్వం తాజాగా స్పందించింది. భారత్ సరిహద్దుల్లో ముళ్లకంచె వేయడంపై బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సలహాదారు ఎం.హెచ్. కబీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ముళ్ల తీగలకు ఢాకా భయపడదు" అని పేర్కొంటూనే, తమ జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భారత్ అంతర్గత రాజకీయాల్లో తాము జోక్యం చేసుకోమని, తమకు ప్రధానంగా కేంద్ర ప్రభుత్వంతోనే సంబంధాలు ఉంటాయని ఆయన వివరించారు. సవాళ్లు ఉన్నప్పటికీ ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచేందుకు నాయకత్వం కట్టుబడి ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ తన ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం, అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే సరిహద్దు కంచె నిర్మాణ ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించింది. ముఖ్యమంత్రి సువేందు అధికారి తొలి మంత్రివర్గ సమావేశంలోనే బీఎస్ఎఫ్‌కు అవసరమైన భూమిని కేటాయించడం ద్వారా ఈ దిశగా బలమైన ముందడుగు వేశారు. అక్రమ చొరబాట్లను అరికట్టడమే లక్ష్యంగా చేపట్టిన ఈ చర్య ఇప్పుడు పొరుగు దేశంతో ఉన్న సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది.

## విజయవాడలో ఏసీపీ సత్యానందం ఇంట్లో భారీ పేలుళ్లు



అమరావతి: విజయవాడ నగరంలోని పటమటలంక ప్రాంతంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీస్ ఉన్నతాధికారి, ఏసీపీ సత్యానందం నివాసంలో మొదట ఏసీ కంప్రెషర్, ఆ తర్వాత గ్యాస్ సిలిండర్ పేలడంతో స్థానికంగా కలకలం రేగింది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రాణనష్టం తప్పింది. అయితే, పేలుడు ధాటికి ఎగిరివచ్చిన రాయి తగిలి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఏసీపీ సత్యానందం తన కుటుంబంతో కలిసి ఈ నెల 7న విదేశీ పర్యటనకు వెళ్లారు. దీంతో వారి ఫ్లాట్ మూసి ఉంది. ఈ క్రమంలో మంగళవారం నాడు మధ్యాహ్నం ఒక్కసారిగా ఏసీ కంప్రెషర్ నుంచి భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఆ తీవ్రతకు సమీపంలో ఉన్న గ్యాస్ సిలిండర్ సైతం పేలిపోయింది. ఈ వరుస పేలుళ్లతో అపార్ట్‌మెంట్‌లోని కిటికీల అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో పేలుడు శిథిలాల నుంచి ఓ రాయి బయట ఉన్న ఒక వ్యక్తికి బలంగా తగలడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పెద్ద శబ్దాలు విని భయాందోళనకు గురైన అపార్ట్‌మెంట్ వాసులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఏసీ కంప్రెషర్‌లో సాంకేతిక లోపం కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

VIGNAN PATRIKA APTEL/2024/89102

విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)




# కావలి జనసేనలో సుక్కు, సెగ....





కావలి : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ : కావలి రాజకీయ నాయకుడిగా పేరు ఉన్న మలి శెట్టి ని బెదిరించినట్లు వార్తలు వచ్చాయి ఇసుక గ్రావెల్ దందా అప్పట్లో సుకురెడ్డి స్తులుగా నియోజకవర్గ రాజకీయ సుక్కు రెడ్డి ఎంట్రీ వార్తలతో ఒక్కసారిగా సెగలు గక్కుతోంది వచ్చే వారమే ఆయన కావలి జనసేన ఇంచార్జిగా పగ్గాలు చేపట్టబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో వ్యాపించడంతో పార్టీలోని పాత కాపులు అగ్గి మీద గుగ్గ లమవుతున్నారు ఏమిటా సోషల్ మీడియా దామారం... గత కొన్నేళ్లుగా పార్టీని నమ్ముకొని క్షేత్రస్థాయిలో జెండా మోసిన నాయకులను కాదని కొత్తగా వస్తున్న వారికి పెద్ద పీట వేయడ మేంటని సీనియర్లు ప్రశ్నిస్తున్నారు ముఖ్యంగా సుక్కు రెడ్డి రాకను వ్యతిరేకిస్తూ పలువురు జనసైనికులు స్థానిక నాయకులు అనం తృప్తిని బాహాటంగానే వెళ్లగక్కుతున్నారు పాత కాపుల ఆవేదన: ప్రశాంతమైన కావలిలో ఫంక్షన్ రాజకీయాలు నడిపిన షాడో ఎమ్మెల్యేగా సుక్కు రెడ్డి అత్యంత వివాదస్పద నేతగా పేరుంది అప్పట్లోనే టిడిపి లో బలమైన నేత త్వశీలో నే నడిచినట్లు టీడీపీ నేతలు ఆరోపణలు చేశారు టిడిపిలోకి సుక్కు రెడ్డి ఎంట్రీని పార్టీ క్యాడర్ బీద రవిచంద్ర తీవ్రంగా వ్యతిరేకించడంతో జనసేన స్థానిక నేతలను మచ్చిక చేసుకుని జనసేన లో చేరకకు తొలగించుకున్నట్లుగా పాత కాపులు అంటున్నారు ఇటువంటి వ్యక్తిని జనసేన లో చేర్చుకోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వచ్చే వారమే మాహోర్తమా విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం కావలి బాధ్యతలను సుక్కు రెడ్డి కి అప్పగించేందుకు హై కమాండ్ మొగ్గు చూపినట్లు తెలుస్తుంది దీనిపై క్లారిటీ రావాల్సి ఉన్నప్పటికీ ఆయన అనుచరులు మాత్రం సోషల్ మీడియాలో అప్పుడే స్వాగత తోరణాలు ఏర్పాట్లు చేస్తున్నారు ఈ దూకుడే పాత నాయకుల్లో మరింత ఆందోళన కలిగిస్తోంది జనసేన లో చీలక వస్తుందా.... కావలి నియోజకవర్గం నుంచి జనసేన ను బలోపేతం చెయ్యాలంటే బలమైన ఆర్థిక అంగబలం ఉన్న నాయకుడు కావాలని ఒక వర్గం వాదిస్తుంటే సిద్ధాంతాలను నమ్ముకున్న పాత వారికే ప్రాధాన్యత ఇవ్వాలని మరో వర్గం పట్టుబడుతోంది మొత్తానికి సుక్కు రెడ్డి ఎంట్రీ కావలి జనసేనలో బ్రకంపనలు సృష్టిస్తోం ది వచ్చే వారం వెలువడ బోయే అధికారిక ప్రక్కన ప్రకటన ఎలాంటి పరిమాణాలుకు దారితీస్తుందో చూడాలి ఒక వేళ ఆయనకు బాధ్యతలు అప్పగిస్తే అలిగిన పాత కాపులను అధిష్టానం ఎలా బుజ్జగిస్తుంది,? లేక కావలి లో కొత్త సమీకరణాలు మొదలవుతాయా? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం

## గోకివాడలో ఘనంగా అభయాంజనేయ జయంతి

రాంబిల్లి మండలం విజ్ఞాన పత్రిక రిపోర్టర్ కోటిని బాబురావు : అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం



గోకీవాడ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అభయ ఆంజనేయ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి గ్రామంలో ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజ కార్యక్రమంలో నిర్వహించితిరి అనంతరం భక్తులకు భారీగా అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమమునకు ఆలయధర్మకర్త శానాపత్ సత్యం దుబాయ్ గ్రామ పెద్దలు సేనాపతి సూరిబాబు ద్వారపురెడ్డి గోవిందరావు పందుల శ్రీనివాసరావు నందవరపు రాఘవ పందుల సూరిబాబు జనపాల శివ కోట్ని బాబురావు పట్నాల వెంకట సూరి సేనాపతి శ్రీను బాబాయ్ డాక్టర్ సత్తిబాబు గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## జమ్మలపాలెం నుడా లేఔట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కావ్య కృష్ణారెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి..!

జలదంకి విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ మే 12న : జలదంకి మండలం జమ్మలపాలెం గ్రామంలోని నుడా







లేఔట్ పరిశీలన కార్యక్రమంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ , కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి , నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తో కలిసి లేఔట్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లేఔట్ యజమానులు మరియు కొనుగోలుదారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉదయగిరి నియోజకవర్గానికి సంబంధించిన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడటం తన బాధ్యత అని స్పష్టం చేశారు. లేఔట్ కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరికి నాణ్యమైన మౌలిక వసతులు అందే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అలాగే లేఔట్ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కాంపౌండ్ వాల్ నిర్మాణం, సీసీ రోడ్ల ఏర్పాటు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ, జంగిల్ క్లియరెన్స్ ఏర్పాటు వంటి అన్ని మౌలిక సదుపాయాలను నాలుగు నుండి ఐదు నెలల వ్యవధిలో పూర్తి చేసి, ఆధునిక వసతులతో కూడిన లేఔట్‌ను లబ్ధిదారులకు అందజేస్తామని పేర్కొన్నారు.

## స్కూల్ డెవలప్మెంట్, హేబిటేషన్ ప్లాన్ వాయిదా వేయాలి



విజ్ఞాన్ దినపత్రిక కృష్ణా జిల్లా ప్రతినిధి ,ఉయ్యూరు : ప్రస్తుత వేసవి శెలవుల సమయంలో ఎస్ఎంసీ అందుబాటులో లేని పరిస్థితుల్లో స్కిల్ డెవలప్మెంట్ ప్లాన్, హేబిటేషన్ ప్లాన్ ఒక్కరోజులో ఇవ్వమని ఉపాధ్యాయుల ఒత్తిడి చేయడాన్ని ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ ఖండిస్తున్నట్టు జిల్లా కార్యదర్శి పీ మణ, మండల అధ్యక్షుడు కె శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మాధవ్ మంగళ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం పాఠశాల పరిధిలో స్కూల్ డెవలప్మె ప్లాన్, హేబిటేషన్ ప్లాన్ సెప్టెంబరు 30 నాటికి పూర్తిచేయడం ఆనవాయితీగా ఉందని, ఈప్లాన్లో ఉన్న సమాచారం, గణాంకాలు ఆధారంగా బడ్జెట్ రూపకల్పన జరుగుతుందనిద తెలిపారు. గ్రామానికి అవసరమైన నూతన పాఠశాల ఏర్పాటు, ఆవాస ప్రాంత పాఠశాలలకు అదనపు తరగతి గదులు, అవాస ప్రాంత ప్రణాళికకు సంబంధించి గ్రామసభ సభ్యుల, సర్పంచ్ ఆమోదంతో కూడిన నివేదికకు గతంలో కనీసం 25 రోజు ల సమయం ఉండేదని వివరించారు. పాఠశాల సమగ్ర అభివృద్ధికి స్కూల్ డెవలప్మె ంట్ ప్లాన్ చాలా అవసరం కాగా ఇటువంటి 90 పేజీల నివేదిక ఒకరోజులో తయారు చేయమని చెప్పడం సబబు కాదన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులందరూ ప్రభుత్వ పా ఠశాలల్లో పిల్లలు చేర్చాలని ఒక ఉద్యమంలా కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. ఐక్యఉపా ధ్యాయ ఫెడరేషన్ తరపున తల్లిదండ్రులనుద్దేశించి 9వేల కరపత్రాలు, ఉపాధ్యాయు లనుద్దేశించి 4వేల కరపత్రాలు వేశామన్నారు. మన ఊరి బడిని బాగుచేద్దాం నినాదం తో ఫెడరేషన్ ముందుకు సాగుతుందన్నారు.

# ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనతో విధులు నిర్వహించండి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

ప్రజా సమస్యల పరిష్కారమే ఉద్యోగుల ప్రధాన బాధ్యత

ప్రస్తుత వేగవంతమైన సమాజంలో చిన్న తప్పు చేసినా ప్రజల్లో దోషులుగా నిలబడే పరిస్థితి

పదోన్నతులు పొందిన వీఆర్వోలకు కలెక్టర్ ప్రేరణాత్మక సందేశం

రికార్డు స్థాయిలో 110 మంది సచివాలయాల వీఆర్వోలకు గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు అందజేసిన కలెక్టర్



నెల్లూరు, విజ్ఞ దినపత్రిక టౌన్ రిపోర్టర్ మే 12 : ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనతో ప్రతి ఉద్యోగి విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లావ్యాప్తంగా వీఆర్వో గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1కు పదోన్నతులు పొందిన 110 మంది సచివాలయాల వీఆర్వోలకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్ఓ విజయ్ కుమార్ నియామక ఉత్తర్వులను అందజేశారు. పదోన్నతులు కల్పిస్తూ పోస్టింగ్‌లు కేటాయించిన సందర్భంగా కలెక్టర్ వీఆర్వోలకు ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. పలు సమస్యలతో తమ వద్దకు వచ్చే ప్రజలను గౌరవించి, వారి సమస్యలను పరిష్కరించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. విధులను క్రమశిక్షణతో నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారువిధుల్లో ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా నిజాయితీగా, పారదర్శకంగా ప్రజలకు సేవ చేయాలని కలెక్టర్ హితవు పలికారు. ప్రస్తుతం వేగవంతమైన సమాజంలో చిన్న తప్పు చేసినా వెంటనే ప్రజల్లో దోషులుగా నిలబడే పరిస్థితి ఉందని, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగి సమాజం తక్కువగా చూసే పరిస్థితులు వస్తాయని పేర్కొన్నారు.ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను పాటిస్తూ ప్రజలకు మేలు చేయడమే అంతిమ లక్ష్యంగా ప్రతి ఉద్యోగి పనిచేయాలని అన్నారు. "మన వంతుగా సమాజానికి కొంత మంచి చేశామనే సంతృప్తి కలిగితేనే మన ఉద్యోగానికి న్యాయం చేసినట్టవుతుంది" అని కలెక్టర్ పేర్కొన్నారు.వీఆర్వోలు ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగి ఉంటారని, వారికి ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందించడం బాధ్యతగా భావించాలని సూచించారు.ఈ సందర్భంగా ఒకే విడతలో 110 మందికి పదోన్నతులు కల్పించిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓలకు వీఆర్వోలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సచివాలయ వీఆర్వోలకు తొలిసారిగా పదోన్నతులు కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసులు, తాసిల్దార్ డానియల్ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

## జనగణనకు ప్రజలు సహకరించాలి

(ఫొటో = చినఓగిరాలలో జరుగుతున్న జనగణనపై ఎన్యూమరేటర్ నుండి వివరాలు తెలుసుకంటున్న తహసీల్దార్ సురేశ్ కుమార్)



విజ్ఞాన్ దినపత్రిక కృష్ణా జిల్లా ప్రతినిధి ,ఉయ్యూరు : మండల పరిధి గ్రామాల్లో జరుగుతున్న జనగణన -2027 పనితీరును తహసీల్దార్ ఎం. సురేశ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. చినఓగిరాల, పెదఓగిరాలలో పర్యటించి ఎన్యూమరేటర్లు ప్రతి గృహాన్ని సందర్శిస్తుంది లేనిది, సమాచారం సక్రమంగా తీసుకుం టున్నారా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఎన్యూమరేటర్లకు గ్రామస్తుల సహకారంపై ఆరాతీశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, మండలపరిధి గ్రామాల్లో సుమారు 15 వేల కుటుంబాలు ఉన్నాయని, ప్రాథమిక నిర్ధారణ కాగా అందులో ఇప్పటి వరకు 6వేల గృహాల గణన పూర్తయిందని తెలిపారు. జనగణన ప్రజల సౌకర్యాల ఎర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అతిముఖ్యమైన కార్యక్రమమని దీనికి ప్రజల సహకరించాలని విజ్ఞప్తిచేశారు.

## వాడవాడలా భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

(ఫొటో - హనుమాన్ నగర్ లో భక్తులకు అన్నసమారాధన ప్రారంభిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్)





విజ్ఞాన్ దినపత్రిక కృష్ణా జిల్లా ప్రతినిధి ,ఉయ్యూరు : హనుమజ్జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రత్యేక పూజలు తమలపాకు పూజలు అన్నదానము వంటివి ప్రతి దేవాలయంలో నిర్వహించారు. స్థానిక హనుమాన్ నగర్ లో జరిగిన హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు వై వి బి రాజేంద్రప్రసాద్ హనుమజ్జయంతి పురస్కరించుకుని 5వేల మంది భక్తులకు అన్నసమారాధన చేయడం అభినందనీయమని అన్నారు. హనుమాన్ నగర్ లో అభయాంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం ఆలయ కమి టీ ఏర్పాటుచేసిన భారీ అన్న సమారాధన రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హనుమజ్జయంతి రోజున ప్రతియేటా భక్తులకు అన్నసమారాధన చేస్తున్న అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు అభినందనీయులన్నారు. ఉయ్యూరు మాజీ చైర్మన్లు, జంపాన పూర్ణచంద్రరావు, వల్లభనేని సత్యనారాయణ, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, మాజీ అధ్యక్షుడు రామినేని కుటుంబ నరసింహారావు, టీడీపీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు తదితరులు పాల్గొన్నారు. కాపులు వీధి రామాలయంలోనూ స్థానిక సువర్చలా సమేత ఆంజనేయ స్వామి దేవస్థానంలోనూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు మండలంలోని కాటూరు కలవపాముల, పెదవోగిరాల, ఆకునూరు తదితర గ్రామాల్లో కూడా అనుమతి జయంతి వేడుకలు జరుపుకున్నారు

## సీబీసీఎన్సీ జిల్లాకార్యవర్గం ఏకగ్రీవం

(పొటో - జిల్లా అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశములో మాట్లాడుతున్న దీపక్ కుమార్ )



విజ్ఞాన్ దినపత్రిక కృష్ణాజిల్లా ప్రతినిధి ,ఉయ్యూరు : సీబీసీఎన్సీ కృష్ణా జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక బెన్నిట్ మెమోరియల్ బాప్టిస్టు సంఘం ఆవరణలో మంగళవారం జరిగిన సీబీసీఎన్సీ కృష్ణా అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశములో అసోసియేషన్లోని 5 ఫీల్డు కౌనిళ్లనుండి సంఘ కాపరులు, సంఘ పెద్దలు హాజరై నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా పరిమి ఇమ్మానుయేల్ దీపక్ కుమార్, కార్యదర్శిగా రెవరెండ్ డీవీ రత్నం, ట్రెజరర్గా రెవరెండ్ పి దేవదానం ఎంపికయ్యారు. అసోసియేషన్ పూర్వపు అధ్యక్షుడు రెవరెండ్ ఆర్ఎస్ పాల్ అధ్యక్షతన జరిగిన సమావేశములో అసోసియేషన్ కార్యదర్శి డీవీ రత్నం పాల్గొన్నారు. 2026 నుండి 2028 వరకు మూడు సంవ త్సరాల కాలపరిమితికి నూతన కృష్ణా అసోసియేషన్ కార్యవర్గం పనిచేస్తుందని ఆర్ ఎస్ పాల్ తెలిపారు. అసోసియేషన్ భలోపేతం, నిరుపయోగంగా ఉన్న స్కూల్ స్థలాల సంరక్షణ, నిర్వహణ కొరకు ఫీల్డ్ కౌన్సిల్ ద్వారా స్థానిక సంఘములకు అప్పగించడం మెడికల్ సీట్లు ఎంపిక నిర్వహణ లోపములపై చర్చ, ఏసీటీసీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ కు అసోసియేషన్ వారిగా ప్రాతినిధ్యం, సెమినరీ కౌన్సిల్ రిజిస్ట్రేషన్, సింగపూర్ యూ నివర్సిటీ గుర్తింపు, బాప్టిస్ట్ వరల్డ్ ఆలయన్స్కు రాయబారుల ఎంపికపై చర్చించినట్టు దీపక్ కుమార్ తెలిపారు.

## వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు







(విజ్ఞాన్ దినపత్రిక విలేఖరి వాకాడు మండలం.) : తిరుపతి జిల్లా వాకాడు మండలంలోని ప్రసిద్ధ శ్రీ పట్టాభిరామాలయంలో హనుమజ్జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. స్వామివారికి సుప్రభాత సేవ,విష్వక్సేన ఆరాధన,పుణ్యాహవాచనం,కళశ స్థాపన,చతుర్దశ కళశ స్నపన,సహస్ర నాగవల్మీ దళార్చన,సింధూరార్చనలు జరిగాయి.స్వామివారికి ద్వాదశ ఆరాధన, ప్రాకారోత్సవంలో ద్వాదశప్రదక్షిణలు జరిగాయి. ఉభయకర్తలుగా వాకాడు సాయి కృష్ణ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీస్ అధినేతల పుట్టం వేంకటేశ్వర్లు రెడ్డి,అనూరాధ,డాక్టర్ సాయి కౌశిక్ రెడ్డి,శ్రీవాణి దంపతులు వ్యవహరించారు.ఈ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు దీవి అనంతబాబు శ్రీ వైఖానస ఆగమోక్తంగా నిర్వహించారు.నరేష్ శర్మ,నాగేంద్ర శర్మ,కోన సాయిబాబు తదితరులు స్వామివారి పూజలు నిర్వహించారు.ఆలయ ధర్మకర్తలు కొడవలూరు దామోదరరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.కార్యక్రమంలో శ్రీరామసేన సభ్యులు హరీష్ రెడ్డి.శివకుమార్,సిద్దయ్య,తేజ,వినయ్, పవన్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## శ్రీ హరి హర క్షేత్రంలో వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు...

230 కలశములతో స్వామి వారి అభిషేకం.

వైభవంగా నగరోత్సవం







చీమకుర్తి మే 12 విజ్ఞాన్ పత్రిక ప్రకాశం జిల్లా బ్యూరో : విశేష పూజలు, అభిషేకం, హోమాలు నిర్వహించిన రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు దంపతులు, శిద్దా పాండురంగరావు దంపతులు,శిద్దా సుధాకర్ దంపతులు,శిద్దా సుధీర్ కుమార్.హనుమజ్జయంతి సందర్భంగా శ్రీ హరిహర క్షేత్రంలో శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారికి విశేష పూజలు,హోమాలు,అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు దంపతులు, శిద్దా పాండురంగరావు దంపతులు,శిద్దా సుధాకర్ దంపతులు,వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.ఆలయ అర్చకులు,ఉభయ దాతలు,భక్తులు రుత్వికుల ఆలయ ధర్మ కర్తల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ంంశ్రీ గణపతి పూజ, పుణ్యాహవాచనం,అగ్ని ప్రతిష్ట, లక్ష్మి గణపతి హోమము,మూలబింబ మంత్ర హోమములు, మన్య సూక్త హోమము, నవగ్రహ హోమం, శాంతి హోమం, మహా పూర్ణహుతి నిర్వహించారు. తదుపరి శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారికి 230 కలశములతో మరియు పంచామృత ఫలరస, సుగంధ ద్రవ్యములతో స్వామి వారికి అభిషేకం, అనంతరం స్వామి వారి విశేష అలంకరణ...లక్ష నాగవల్లీ దళార్చన,మహా నైవేద్యం, మహా మంగళ హారతి, మహా మంత్ర పుష్పము, క్షమా ప్రార్థన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు భక్తులచే సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం,హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో హనుమాన్ భజన నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం స్వామి వారికి శిద్దా రాఘవ రావు దంపతులు,శిద్దా పాండురంగరావు దంపతులు,శిద్దా సుధాకర్ దంపతులు భక్తులతో కలసి విశేష పూజలు నిర్వహించారు. శ్రీ శిద్దా వెంకట సుబ్బమ్మ,వెంకటేశ్వర్లు ట్రస్ట్ అధ్వర్యంలో భక్తులకు,అన్న ప్రసాదాలు అందచేసారు.వైభవంగా శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారి నగరోత్సవం.హనుమ జయంతి సందర్భంగా శ్రీ హరిహర క్షేత్రం నుండి చీమకుర్తి పుర వీధుల్లో స్వామి వారి నగరోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.చీమకుర్తి కి చెందిన హనుమాన్ భక్తులు,ఆర్యవైశ్య మహిళలు స్వామి వారి నగరోత్సవంలో పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణం ఆలాపన చేశారు.ఈ కార్యక్రమంలో శిద్దా సుధాకర్ దంపతులు,శిద్దా పెద్ద బాబు,, శిద్దా వెంకట ప్రసాద్, శిద్దా కాశీ, శిద్దా సాయి బాబు దంపతులు, ఆలయ ఇంచార్జీ ఎమ్.వెంకటేశ్వర్లు,ఆలయ అర్చకులు సుబ్రమణ్య శర్మ,హరి వెంకట కుమారా చార్యులు,హరి కృష్ణ శర్మ,కృష్ణ శర్మ,ఉభయ దాతలు,భక్తులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాల కట్టడికి ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరం చేసిన ప్రకాశం జిల్లా పోలీసులు...

పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు.



సింగరాయకొండ మే 12 విజ్ఞాన్ పత్రిక ప్రకాశం జిల్లా బ్యూరో : ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్. ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక పోలీసు బృందాలు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో టాస్క్ ఫోర్స్ సీఐ భీమ నాయక్ ఆధ్వర్యంలో ఎస్సై చెంచయ్య మరియు సిబ్బంది కలసి సింగరాయకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమరాజు పల్లి గ్రామ సమీపంలో కోత ముక్క పేకాట ఆడుతున్న 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుండి రూ.65,500/- నగదు మరియు 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.జూద క్రీడలు మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.అలాగే, జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఉంటే, వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

VIGNAN PATRIKA APTEL/2024/89102

విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)




## ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయాలి...

మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి...





కొనకనమిట్ల మండలం మే 12 విజ్ఞాన్ దినపత్రిక ప్రకాశం జిల్లా బ్యూరో : మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి కొనకనమిట్ల మండలంలోని చినారికట్ల, సిద్ధవరం మరియు నాగరాజు కుంట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చినారికట్ల గ్రామంలో మాట్లాడుతూ ఈ గ్రామంలో ఎప్పుడు తనకు మెజారిటీ ఇవ్వలేదని అయినా కూడా 2015 వ సంవత్సరంలో చిన్నారి కట్ల, పెదారికట్ల గ్రామాల ప్రజలు త్రాగునీటికి ఇబ్బంది పడుతున్నారని తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పెదారికట్ల గ్రామంలో రోడ్డుపై రాత్రిపూట గంటలపాటు బైఠాయించానని అప్పటి ఒక కనిగిరి శాసనసభ్యులు తనతో సంప్రదింపులు అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్తానని మాట ఇచ్చారని అదే ఇప్పుడు చిన్నారి కట్ల పెదారికట్ల గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చడానికి 55 కోట్ల రూపాయల తో పైపులైన్ నిర్మాణాశీ చేపడుతున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో ఇక్కడి పెత్తనం చేస్తున్న నాయకులు ఎప్పుడైనా ప్రజలను పట్టించుకున్నారా అని ప్రజలను ప్రశ్నించారు. కార్యకర్తలందరూ ఐక్యంగా ఉండి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి ప్రచారం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం నాగరాజకుంట గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి వారి జయంతి ఉత్సవాలలో భాగంగా గ్రామానికి విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొనకనమిట్ల మండల తెలుగుదేశం నాయకులు ఆయా గ్రామాల తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈ నెల 30లోగా జనగణన సర్వే పూర్తి కావాలి: తాహసిల్దార్ వెంకటేశ్వర్లు నాయక్



విజ్ఞాన పత్రిక మణికుమార్ పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం : రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న జనగణన సర్వేలో భాగంగా చేపడుతున్న ఇంటింటి జనగణనను కారంపూడి మండలంలో ఈ నెల 30లోగా పూర్తి చేయాలని తాహసిల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం కారంపూడి మండలంలో జరుగుతున్న ఇంటింటి గణనను అయన కారంపూడి, ఒప్పిచర్ల, లక్ష్మీపురం పలు గ్రామాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్ఎల్బీ యాప్ లో వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించి, రోజువారీ లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. ఇంటింటి జనగణన సర్వే పై నిర్లక్ష్యం వహిస్తే కట్టిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాబట్టి సిబ్బంది ప్రతి ఒక్కరు తమకు కేటాయించిన గ్రామాలలో ప్రతి ఇంటిని వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. జనగణన సర్వే లో ప్రతి కుటుంబ సభ్యులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

# ఎవరు?

అలవాట్లు మార్చుకోకుండా
అటు అయోధ్య వెళ్లినా
ఇటు అరుణాచలం తిరిగినా
బ్రతుకులు ఏం మారవులే!
మంచి చేసినోళ్లనే
ఇది ముంచే కాలం మిత్రమా!
మేలు చేసినోళ్ళకే
కీడు చేసే కాలం ఇది
అందుకే... ఎవర్ని నమ్మొద్దు
నమ్మి నువ్వు మోసపోవద్దు!
ఎవడో గీసిన గీతలో
నడవడానికి నువ్వు
గాలికి తిరిగే గొర్రెవు కాదు
నీదారిని నువ్వే ఎంచుకొని
రహదారిలో నడిచే రాజువు
ఎవరు నీ తలరాత రాసేది?
ఎవడు నీ దారి మార్చేది?
కనే కలలు నీవే
పడే కష్టం నీదే
ఆశలు నీవే
శ్వాస నీదే
తలచేది నువ్వు
తడబడేది నువ్వు
అది నీ ప్రయత్నం
సాధించాలి విజయం
నీ జీవితం నీచేతుల్లోనే ఉంది.

రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి : 98661793850o



# సొంతిళ్లు లేని వారికి రాష్ట్ర సర్కార్ గుడ్ న్యూస్..

# రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు ముహూర్తం ఫిక్స్..!




తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కీలక ప్రకటన చేశారు. సొంతిళ్లు లేని నిరుపేదల కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పథకం అమలుకు సంబంధించిన విధివిధానాలను వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కీలక ప్రకటన చేశారు. సొంతిళ్లు లేని నిరుపేదల కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పథకం అమలుకు సంబంధించిన విధివిధానాలను వెల్లడించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతను లాంఛనంగా ప్రారంభించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇప్పటికే మొదటి విడతను విజయవంతంగా పూర్తి చేస్తోందని, దీనికి సంబంధించిన పూర్తి స్థాయి విధివిధానాలను మే 21న జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయించనున్నట్లు తెలిపారు.

నియోజకవర్గమే యూనిట్‌గా స్థలాల గుర్తింపు

పేదలకు ఇచ్చే ఇళ్లు వారి జీవనోపాధికి ఆటంకం కలగకుండా ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం 5-8 కిలోమీటర్ల పరిధిలో నివాస స్థలాలు గుర్తించాలని నిర్ణయం. లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతానికి లేదా నియోజకవర్గానికి గరిష్ఠంగా 5 నుంచి 8 కి.మీ. పరిధిలోనే ఇళ్లను నిర్మించాలని నిర్ణయించారు. గత ప్రభుత్వం నగరానికి 20-30 కి.మీ. దూరంలో డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించడం వల్ల లబ్ధిదారులు అక్కడికి వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఆ తప్పు పునరావృతం కాకుండా మురికివాడలు, ప్రభుత్వ భూములు, భూదాన్ భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించారు.

2దీఎఖ ఇళ్ల కేటాయింపుపై స్పెషల్ డ్రైవ్

హైదరాబాద్‌లో ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపును వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. మే నెలాఖరు నాటికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్లను కేటాయించాలి. ఇందిరమ్మ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజీ, విద్యుత్ వంటి కనీస వసతులు కల్పించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. సొంత స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోవాలనుకునే అర్హులకు ఈ నెలాఖరులోగా మంజూరు పత్రాలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఆక్రమణలపై ఉక్కుపాదం

ప్రభుత్వ భూమి అంగుళం కూడా అన్యాక్రాంతమైతే సహించేది లేదని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా భూముల రిజిస్ట్రేషన్ చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, మల్కాజిగిరి ఘటనను ఉదాహరణగా చూపుతూ సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలకు ఆదేశించారు. రెవెన్యూ, ఫారెస్ట్ సరిహద్దు వివాదాలను పరిష్కరించి, ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమీక్షలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, స్పీకర్ ప్రసాద్ కుమార్ తదితరులు పాల్గొని, పేదరికమే ప్రాతిపదికగా, ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూడాలని అధికారులకు సూచించారు.

## హనుమాన్ జయంతి వేడుకలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ..!



జలదంకి విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ మే 12న : జలదంకి మండలం, కమ్మవారిపాలెం గ్రామంలో హనుమాన్ జయంతి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ పవిత్ర ఉత్సవాలలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొని శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను భక్తిశ్రద్ధలతో స్వీకరించి ఆలయ నిర్వాహకులు, గ్రామ ప్రజలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, భక్తులకు ధైర్యం, శక్తి, భక్తి ప్రసాదించే శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పంటలతో సంతోషంగా ఉండాలని, ప్రతి కుటుంబం ఆనందం, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని మనసారా ప్రార్థించారు.

## నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల..!



కావలి మే 12న :విజ్ఞాన్ దినపత్రిక : కావలి పట్టణంలోని వెంగళరావు నగర్‌లో వింజమూరు ఎంపీడీవో కేతు శ్రీనివాసుల రెడ్డి -- హరిణి దంపతులు నూతనముగా నిర్మించిన గృహప్రవేశ మహోత్సవ వేడుకలలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొని దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నూతన గృహంలో అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు శుభాభినందనలు తెలియజేస్తూ, ఈ ఇంటిలో ఎల్లప్పుడూ ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారి ఆనందంలో భాగస్వాములయ్యారు.

## హనుమాన్ జయంతి వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన దామంచర్లసత్య ఈరోజు



విజ్ఞాన్ దినపత్రిక : పర్చూరు నియోజకవర్గం పావులూరు గ్రామం నందు వేంచేసియున్న శ్రీ ం ప్రత్యేక పూజలు నిర్వహించిన రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ ౘ జోనల్ కో-ఆర్డినేటర్ లి దామచర్ల సత్యలి అనంతరం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభను సందర్శించి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించడం జరిగింది.

## హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొని వీరాంజనేయ స్వామి దర్శించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ..!





దుత్తలూరు మే 12 న విజ్ఞాన్ దినపత్రిక : హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని దుత్తలూరు మండలం, వెంకటంపేట గ్రామంలో వెలసి ఉన్న శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి వారిని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను భక్తిపూర్వకంగా స్వీకరించి స్వామివారి అనుగ్రహానికి పాత్రులయ్యారు. అనంతరం అదే గ్రామంలోని శ్రీశ్రీశ్రీ సీతారాముల వారి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తదుపరి గ్రామస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే గ్రామ అభివృద్ధి, మౌలిక వసతులు, తాగునీరు, రహదారులు తదితర సమస్యలపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలతో కలిసి గ్రామ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

## మహానాడు సన్నాహక సమావేశం ఏర్పాట్లను పరిశీలించిన టీడీపీ నేతలు







విజ్ఞాన్ దినపత్రిక : కొడవలూరు మండలం, ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రాంగణంలో మే 27,28,29 తేదీలలో నిర్వహించనున్న మహానాడు కు సంబంధించిన సన్నాహక సమావేశం రేపు ఉదయం 10 గంటలకు కిషన్ సెజ్ ప్రాంగణంలో జరగనున్నది. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తో పాటు రాష్ట్ర మంత్రులు, సీనియర్ నాయకులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఈరోజు సన్నాహక సమావేశం ఏర్పాట్లను,మహానాడు ఏర్పాట్లను నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు బీద రవిచంద్ర,కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఛైర్మన్ డా జెడ్ శివప్రసాద్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, తదితరులు పరిశీలించారు.

## రేపు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన సమీక్ష

ఏర్పాట్లు పరిశీలించిన టీడీపీ నేతలు.



విజ్ఞాన్ దినపత్రిక : ఈ నెల 27, 28, 29 తేదీల్లో కోవూరు నియోజకవర్గం రాచర్లపాడు వద్ద నిర్వహించనున్న మహానాడు పండుగ ఏర్పాట్లను. సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, ఏపీ ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి లు పరిశీలించారు. ఈ సందర్భంగా బుధవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు అధ్యక్షతన జరగనున్న సమీక్ష సమావేశ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మహానాడు లేఔట్ ను పరిశీలించి, సమీక్షించి నేతలు పలు సలహాలు సూచనలు జారీ చేశారు.


Printed by: komalagunta Nageswara Rao D.NO.16-256/3,UP Stair,Near Hanuman Temple, sankaraiah Buildings,Rayaji street, Nellore, sri potti sriramulu Nellore Dist. ANDHRAPRADESH PiNNo-524001, Published by : KALIKI UDAYKUMAR REDDY D.NO.Lig1-697, kalluru palli Housing Board colony, Nellore-524004 S.P.S.R Nellore District, Owned by : KALIKI UDAYKUMAR REDDY D.NO.Lig1-697, kalluru palli Housing Board colony, Nellore-524004 S.P.S.R Nellore District, Printed at : Deepak roshan Graphics Digital&Mutt colour printers, D.NO.16-256/3,UP Stair,Near Hanuman Temple, sankaraiah Buildings,Rayaji street, Nellore, sri potti sriramulu Nellore Dist. ANDHRAPRADESH PiNNo-524001, published at :D.NO.Lig1-697, kalluru palli Housing Board colony, Nellore-524004 S.P.S.R Nellore District, Editor : KALIKI UDAYKUMAR REDDY D.NO.Lig1-697, kalluru palli Housing Board colony, Nellore-524004 S.P.S.R Nellore District,